పథకాలు రాని గ్రామాల్లో రణరంగమే

- కాంగ్రెస్ వంచనను ప్రజలు క్షమించరు
- ఎన్నికలైన ఏడాది తర్వాత 'ఒక్క'మంత్రమా?
- వన్ విలేజ్ అనడం ప్రజలను వెన్నుపోటు పొడవడమే
- మండలానికి ఒక్క ఊరిలోనే పథకాలు అని ఎన్నికల మ్యానిఫెస్టోలో ఉన్నదా?
- రేవంత్‌రెడ్డి సర్కార్‌కు కేటీఆర్ సూటి ప్రశ్నలు
- ఉపముఖ్యమంత్రి భట్టి వ్యాఖ్యలపై ఫైర్

హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ): వంద రోజుల్లోనే హామీలు అమలుచేస్తామని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు.. వన్ ఇయర్ తర్వాత వన్ విలేజ్ అనడం తెలంగాణ ప్రజలకు వెన్నుపోటు పొడవడమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వ పథకాలు రాని గ్రామాలు రణరంగంగా మారుతాయని హెచ్చరించారు. 'మండలానికి ఒక్క గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని ఆ గ్రామంలో 4 పథకాలను అమలు చేస్తాం' అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. అన్నీ ఇస్తామని మభ్యపెట్టి ఏడాది తర్వాత ఒక్క గ్రామమే అని పేర్కొనటం సర్కార్ దిగజారుడుతనానికి నిదర్శనమని మండిపడ్డారు. రాష్ట్రంలోని ప్రతి మండలం, ప్రతి గ్రామంలోని ప్రతి ఇంటా అబద్ధపు హామీలు ఊదరగొట్టి.. గద్దెనెక్కి నాన్చి నాన్చి ఇప్పుడు మండలానికి ఒక గ్రామంలోనే పథకాలను ప్రారంభించడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. 'మండలానికి ఒక గ్రామంలోనే కాంగ్రెస్ మ్యానిఫెస్టో, గ్యారెంటీ కార్డులను పంచిండ్రా?, ఒక్క ఊరిలోనే ప్రచారం చేసి, ఆ మేరకే హామీలిచ్చి, కేవలం ఆయా గ్రామాల ప్రజలనే ఓట్లు అడిగిండ్రా?' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి ఆదివారం ఒక ప్రకటనలో ప్రశ్నలు సంధించారు. కాంగ్రెస్ పార్టీ అనేక గడువులు పెట్టి వాయిదాల మీద వాయిదాలు పెట్టి చివరికి రాష్ట్ర ప్రజలను గణతంత్ర దినోత్సవం సందర్భంగా మోసం చేసిన తీరు దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్నికల ముందు ప్రచారంలో గాని, శనివారం సాయంత్రం వరకు గాని ఏ రోజు కూడా మండలానికి ఒక్క గ్రామంలోనే పథకాలను అమలు చేస్తామని ప్రభుత్వం చెప్పలేదని విమర్శించారు.

> మండలానికి ఒక్క గ్రామంలోనే కాంగ్రెస్ మ్యానిఫెస్టోలను పంచిండ్రా? మండలానికి ఒక్క గ్రామంలోనే గ్యారెంటీ కార్డులు ఇచ్చిండ్రా? ఎన్నికల ప్రచారాన్ని ఒక్కగ్రామంలోనే చేసిండ్రా? మండలంలో ఒక్కగ్రామంలోనే ఓట్లు అడిగిండ్రా? నాడు అందరికీ అన్నీ అని మభ్యపెట్టి ఇవ్వాళ కొందరికే కొన్ని అన్నట్టు చేస్తూ నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను వంచించిన కాంగ్రెస్‌ను రాష్ట్ర ప్రజలు క్షమించరు. -కేటీఆర్

> చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కో గ్రామంలో మాత్రమే పథకాలు ప్రారంభించి చేతులు దులుపుకొన్నది. ఇది ముమ్మాటికీ యావత్ తెలంగాణ ప్రజలను మోసం చెయ్యడమే. ఈ స్పీడుతో పథకాలను ప్రభుత్వం అమలు చేసుకుంటూపోతే 60 ఏండ్లయినా తెలంగాణలోని అన్ని గ్రామాలకు పథకాలు అందవు. -కేటీఆర్

నేడు బీఆర్ఎస్వీ క్యాలెండర్ ఆవిష్కరణ

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సోమవారం ఉదయం 11 గంటలకు బీఆర్ఎస్వీ క్యాలెండర్‌ను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవిష్కరించనున్నారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమంలో బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొననున్నారు.

మోసగిస్తే తగిన బుద్ధి చెప్తరు

ఆరు గ్యారెంటీలు, 420 హామీల పేరుతో కాంగ్రెస్ చేసిన నయవంచనను నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు క్షమించబోరని కేటీఆర్ స్పష్టంచేశారు. అన్ని గ్రామాల ప్రజలు కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలను గుర్తుపెట్టుకున్నారని తెలిపారు. ప్రతి ఇంటికీ అబద్ధపు హామీలను ఊదరగొట్టి వన్ ఇయర్ తర్వాత వన్ విలేజ్ అనడం ప్రజలకు వెన్నుపోటు పొడవడమే అని మండిపడ్డారు. 'ప్రతిపక్షంగా ఇంకో నాలుగేండ్లు ఓపిక పట్టడానికి మేము సిద్ధం కాని, ఏరుదాటాక తెప్ప తగలేసే మీ ఏడాది దగా పాలనను చూసిన తర్వాత ఆగడానికి ప్రజలు మాత్రం సిద్ధంగా లేరు. పథకాలు రాని గ్రామాల్లో రేపటి నుంచి ప్రజా రణరంగమే జరుగుతుంది. కాంగ్రెస్ చేతిలో మోసపోయిన ప్రతి గ్రామానికి, ప్రజలకు అండగా ఉంటాం. కాంగ్రెస్ చేసిన ఈ దుర్మార్గానికి, మోసానికి అనేక రకాలుగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం' అని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే మండలానికి ఒక ఊరు అనే మోసపూరిత విధానాన్ని పక్కనపెట్టి అన్ని గ్రామాల్లో స్యాచురేషన్ పద్ధతిలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులను ప్రజలు బహిష్కరిస్తారని హెచ్చరించారు.

సర్కార్‌పై పైలట్ గ్రామాల ఫైట్

మొదటిపేజీ తరువాయి...

పైలట్ ప్రాజెక్టుగా స్వీకరిస్తాం..సాచురేషన్ పద్ధతిని అమలు చేస్తాం' అని ప్రభుత్వ పెద్దలు ప్రకటించినదానికి ఆచరణకు పొంతనలేకపోవటంతో రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు రసాభాసాగా మారాయి. పైలట్ గ్రామాలు సైతం సర్కార్‌పై ఫైట్ చేశాయి. మరోవైపు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారనే అక్కసుతో కాంగ్రెస్ శ్రేణులు ప్రజలపై తమ ప్రతాపాన్ని చూపాయి. నిలదీసిన వారిని నిలువరించే ప్రయత్నం చేయకపోగా పోలీసులను ఉసిగొలిపి చితక్కొట్టించిన ఉదంతాలపై ఆగ్రహం వ్యక్తం అవుతున్నది. నిలదీసిన వారిని ఈడ్చుకెళ్లటం, ప్రశ్నించిన వారిని పోలీసులతో కట్టడి చేయించటంతో అనేకచోట్ల గ్రామసభలు ఉద్రిక్తంగా మారాయి.

నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని సాంగ్వీ గ్రామంలో నాలుగు పథకాల అమలు గ్రామ సభలో అధికారులను నిలదీస్తున్న మల్లాపూర్ గ్రామస్తులు

ఎర్రకుంట తండాలో లాఠీచార్జి

ఇందిరమ్మ పాలన అంటే ఇట్లుంటదని కాంగ్రెస్ సర్కార్ మరోసారి నిరూపించే ఘటన జనగామ నియోజకర్గంలో చోటుచేసుకున్నది. ఎర్రకుంట తండాలో జరిగిన గ్రామసభ ఉద్రిక్తతలకు దారితీసింది. అనర్హులకు పథకాలు ఎలా అందజేస్తారని నిలదీసిన పాపానికి బీఆర్ఎస్ నాయకులపై పోలీసులు రెచ్చిపోయారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని అరెస్టు చేశారు. ఒక దశలో ఎమ్మెల్యే పల్లాపై కాంగ్రెస్ నాయకులు కోడిగుడ్లు, టమాటాలు విసిరేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారటంతో పోలీసులు విచక్షణారహితంగా లాఠీచార్జి చేశారు. పరిస్థితి చేయిదాటిపోతున్నదని గ్రహించిన మంత్రి పొంగులేటి సభను రద్దు చేసుకున్నారు.

ఎమ్మెల్యేపైకి కోడిగుడ్లు విసిరిన కాంగ్రెస్ కార్యకర్త

హనుమకొండ జిల్లా శాయంపేట మండలం గట్లకానిపర్తి సభలో భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణరావుపైకి ఓ కాంగ్రెస్ కార్యకర్త కోడిగుడ్లు విసరడం గందరగోళానికి దారితీసింది. కాంగ్రెస్ కార్యకర్త బొమ్మకంటి ప్రశాంత్ కోడిగుడ్లు విసిరినట్టు గుర్తించిన పోలీసులు అతడిని వెంటనే అదుపులోకి తీసుకున్నారు. కోడిగుడ్లు ఎమ్మెల్యే పక్కనుంచి వెళ్లి వెనుకాల ఫ్లెక్సీకి తగిలాయి. ఇందిరమ్మ జాబితాలో పేరు ఉన్నా తనకు ఇప్పుడు ఏమీ ఇవ్వడం లేదన్న అక్కసుతోనే ప్రశాంత్ కోడిగుడ్లు విసిరినట్టు గుర్తించారు.

నీకు మైకెవడిచ్చిండు..

మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం పొన్నాలలో కాంగ్రెస్‌నేతలతో పాటు అధికారులు వ్యవహరించిన తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ మొదలుకాగానే కాంగ్రెస్ నేతలు తమకు సరైన గౌరవం ఇవ్వలేదంటూ అధికారులపై దౌర్జన్యంగా వ్యవహరించారు. రామలింగేశ్వరస్వామి ఆలయ మాజీ డైరెక్టర్ వేణుగౌడ్ లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని, అర్హులకు కాకుండా కాంగ్రెస్ శ్రేణులకే కేటాయించారని ఆరోపించారు. ఎలాంటి తప్పులు జరగనప్పుడు జాబితా ఇచ్చేందుకు ఇబ్బందులు ఎందుకని ప్రశ్నించారు. దీంతో ఆగ్రహానికి గురైన కాంగ్రెస్ నేతలు నక్క ప్రభాకర్‌గౌడ్, జీడిపల్లి వేణుగోపాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డితోపాటు మరికొందరు కలిసి వేణుగౌడ్ మీదకు అరుస్తూ వెళ్లడంతో కొంత ఉద్రిక్తత చోటుచేసుకున్నది. ఇదేమిటని స్థానికులు అధికారులను అడిగితే స్వయంగా మండల ప్రత్యేకాధికారి శంకర్ కుమార్ ఆగ్రహంగా 'నీకు మైకు ఎవడిచ్చాడురా? ఎందుకిచ్చారు..? ఆ మైకును లాక్కోండి' అంటూ వేదికపైనే చిందులు తొక్కారు. దీంతో ప్రజలు అధికారి తీరుపై మండిపడ్డారు. పోలీసులు వచ్చి ప్రశ్నిస్తున్నవారిని బయటకి లాక్కెళ్లారు. సభ వేదికపై సీటు కేటాయించలేదని కాంగ్రెస్ నాయకులు గొడవకు దిగారు.

అడిగితే రాదు.. నోరు మూస్కోవాలి

నిర్మల్ జిల్లా కుభీర్ మండలం అంతర్నిలో పథకాలు రానివారు నిలదీశారు. దీంతో అధికారులు 'నోరు మూస్కొని కూర్చుండాలి. అలా అయితేనే మేము మళ్లీ రాసి పంపుతం' అని జులుం ప్రదర్శించారు. ప్రింటింగ్ పూర్తిగా కాలేదని కొందరికే పత్రాలు పంపిణీ చేశారు. ఒంటరి మహిళలకు, ఇండ్లు లేనివారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాకపోవడం, ఒక్కో ఇంట్లో ముగ్గురికి పథకాలు వర్తింపజేయడంతో పలువురు గగ్గోలు పెట్టారు.

అధికారులపై వృద్ధుడి ఆగ్రహం

'కేసీఆర్ సారు ఉన్నప్పుడు నాకు పింఛన్ వచ్చింది. కాంగ్రెస్ పాలనలో రావడం లేదు. నా పింఛన్ ఎందుకు తొలగించిండ్రు' అని 85 ఏండ్ల రైతు సాయన్న అధికారులను నిలదీశాడు. అంతర్నిలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్ మాట్లాడుతుండగా సాయన్న వేదిక వద్దకు వచ్చి తనకు పింఛన్ రావడం లేదని నిలదీశాడు. కూర్చోవాలని బతిమాలినా ఆగ్రహంతో ఊగిపోతూ సర్కారుపై తిట్ల వర్షం కురిపించాడు.

మేం అడవిల ఉన్నమా?

'మాది ఊరు కాదా? మేం అడవిల ఉన్నమా? మా గ్రామానికి చెందిన లబ్ధిదారుల పేర్లు ఎందుకు చదువుతలేరు?' అని నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం సాంగ్వీ అనుబంధ గ్రామం మల్లాపూర్ గ్రామస్తులు నిలదీశారు. ఇందిరమ్మ ఇండ్ల అర్హత పత్రాలను అధికారులు, ప్రజాప్రతినిధులు అందిస్తుండగా మల్లాపూర్‌కు చెందిన యువకులు, మహిళలు, రైతులు 'మా ఊరులో అర్హులు ఒక్కరూ లేరా?.. మేం ఎన్నికలప్పుడే గుర్తుకొస్తమా.. పథకాలకు పనికి రామా?' అని ఆగ్రహం వ్యక్తంచేశారు.

నెట్ లేక అధికారుల అవస్థలు

మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం బొప్పారంలో సీఎం రేవంత్ ప్రసంగాన్ని ప్రొజెక్టర్ ద్వారా ప్రజలకు చూపెట్టాల్సి ఉండగా, నెట్ సేవలు లేక అధికారులు అవస్థలు పడాల్సి వచ్చింది. చివరకు చేసేదేమీ లేక సెల్‌ఫోన్ ద్వారా మైకులో వినిపించాల్సి వచ్చింది.

- సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్‌లో అనర్హులకు రేషన్ కార్డులు ఇచ్చారని అధికారులను నిలదీశారు. లబ్ధిదారుల జాబితాను గ్రామసభలో చదవకుండా ప్రొసీడింగ్స్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. తాను 30 ఏండ్ల నుంచి పార్టీ కోసం పని చేస్తే, తన పేరు లేకుండానే ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేశారని కాంగ్రెస్‌కు చెందిన మాజీ సర్పంచ్ ఎల్లయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎల్లుపల్లిలో ప్రొసీడింగ్స్‌పై ఎలాంటి సంతకాలు లేకపోవడంతో గ్రామస్తులు నిలదీశారు.

సంతకాలు లేకుండా మంజూరు పత్రాలు

పెద్దపల్లి జిల్లా నిమ్మనపల్లిలో ఎవరి సంతకం లేకుండానే ప్రొసీడింగ్స్ అందించడంతో లబ్ధిదారులు విస్మయానికి గురయ్యారు. పథకాలు తమకు వచ్చినట్టా? రానట్టా? అని ఆలోచనలో పడ్డారు. కమాన్‌పూర్ మండలం రొంపికుంటలో 10 మంది చొప్పున మంజూరు పత్రాలు అందజేయగా, మిగిలిన వారికి ఎప్పుడు ఇస్తారని గ్రామస్తులు, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ప్రశ్నించారు. వారితో కాంగ్రెస్ నాయకులు వాగ్వాదానికి దిగారు.

- జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం విట్టంపేటలో కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావుతో కలిసి మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ మహేశ్వర్‌రెడ్డి లబ్ధిదారుల పేర్లను చదువుతూ మంజూరు పత్రాలు అందజేయగా, మూడు రోజుల క్రితం గ్రామసభ నిర్వహించి పంచాయతీ కార్యాలయంలో ఉంచిన జాబితాలో తమ పేర్లున్నాయని, ఇప్పుడెందుకు లేవని గ్రామస్తులు నిలదీశారు. రాత్రికి రాత్రే తమ పేర్లు తొలగించి అన్యాయం చేశారని మండిపడ్డారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

మద్దూర్, కోస్గి మండలాల్లోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. కోస్గి మండలం చంద్రవంచలో సభకు సీఎం వస్తున్న క్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఎమ్మెల్యేను నిలదీసిన మహిళలు

మహబూబ్‌నగర్ జిల్లా కౌకుంట్ల మండలం తిర్మలాపూర్‌లో నాయకులకు అనుకూలంగా ఉన్న వారినే ఎంపిక చేసి పత్రాలిఇవ్వడం ఎంత వరకు సమంజసమని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిని మహిళలు నిలదీశారు. గ్రామానికి చెందిన లక్ష్మి తమ ఇంటికి తాగునీటి సౌకర్యం కూడా లేదని, రేషన్‌కార్డు, ఇల్లు లేదని అడుగుతున్న క్రమంలో గ్రామ నాయకులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఆమె నేరుగా ఎమ్మెల్యేను అడగగా 'నీకు ఏ పథకం ఇవ్వం' అని కరాఖండిగా సమాధానమిచ్చినట్టు మహిళ ఆవేదన వ్యక్తం చేసింది.

- యాదాద్రి భువనగిరి జిల్లాలో సంస్థాన్‌నారాయణ పురం మండలం కోతులారంలో ప్రజలు అధికారులతో వాగ్వాదానికి దిగారు. నిరుపేదలకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు ఎందుకు రాలేదని మండలం స్పెషల్ ఆఫీసర్ జయశ్రీ కారును అడ్డుకున్నారు. ఓ మహిళ కంట తడి పెట్టి.. బోరున విలపించింది. ఆత్మకూరు (ఎం) మండలంలోని తిమ్మాపురంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కొందరికే ప్రొసీడింగ్స్ ఇచ్చి వెళ్లిపోవడంతో పంచాయతీ కార్యాలయం ఎదట గ్రామస్తులు ధర్నా చేశారు. గుండాల మండలం బురుజుబావిలో తన పేరు ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో లేదని ఓ మహిళ బోరున విలపించింది.

కేసీఆర్‌పై వైరా ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు

ఖమ్మం జిల్లా వైరా మండలం పుణ్యాపురం సభలో పథకాల మంజూరు పత్రాలను వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పంపిణీ చేస్తుండగా 'మా గ్రామానికి ఇంతవరకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు అందలేదు' అని ఓ మహిళ నిలదీసింది. దీంతో ఎమ్మెల్యే దాటవేత సమాధానం చెప్తూ 'గత ముఖ్యమంత్రి కేసీఆర్‌పై మట్టి పోయండి' అంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారు.

బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ దాడి

భద్రాద్రి జిల్లా చంద్రుగొండ మండలం బెండాలపాడు పంచాయతీలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సమక్షంలో మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. చాలామంది అర్హుల పేర్లు జాబితాలో లేవని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మోహన్‌రావు.. పథకాలు రాని కొందరితో కలిసి సభ వద్దకు వెళ్లారు. అప్పటికే కార్యక్రమం ముగిసి ఎమ్మెల్యే వెళ్లిపోగా అధికారులు అక్కడే ఉన్నారు. ఎంపీడీవో అశోక్ దగ్గరకు వెళ్లి అర్హులందరికీ పథకాలు ఎందుకు వర్తింపజేయడంలేదని అడుగగా కాంగ్రెస్ నాయకులు నాగభూషణం, బొర్రా సురేశ్, పొట్ట రాములు కలిసి మోహన్‌రావుపై దాడి చేశారు. జీసీసీ తాత్కాలిక ఉద్యోగి కొడెం రవి దాడిని అడ్డుకోగా కాంగ్రెస్ నాయకులు మరింత రెచ్చిపోయి ఇద్దరిపై తీవ్రంగా దాడిచేశారు. దీంతో కొడెం రవికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పంచాయతీ కార్యాలయం ఎదుట రవితో కలిసి ఆందోళన చేపట్టారు. ఎస్ఐ శివరామకృష్ణ చేరుకొని రవిని దవాఖానకు తరలించారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని సముదాయించే ప్రయత్నం చేశారు. కాంగ్రెస్ నాయకుల దాడిని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు. బాధితులను ఫోన్లో పరామర్శించారు.

భద్రాద్రి జిల్లా బెండాలపాడులో కాంగ్రెస్ నేతల దాడిలో గాయపడిన కొడెం రవి

పల్లాపై కాంగ్రెస్ దాడి

మొదటిపేజీ తరువాయి...

రాళ్లు, కోడిగుడ్లు, టమాటలతో దాడి చేశారు. దాడులను అడ్డుకోవాల్సిన పోలీసులు.. తండావాసులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై లాఠీలతో విరుచుకుపడ్డారు. జనగామ అర్బన్ సీఐ దామోదర్‌రెడ్డి కర్రలు విరిగే వరకు చితకబాదారు. పోలీసుల లాఠీచార్జీలో 16 మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు గాయాలు కాగా, కాంగ్రెస్ నాయకులు విసిరిన రాళ్లు, కోడిగుడ్లు తగిలి నలుగురు మీడియా ప్రతినిధులు గాయపడ్డారు. ఎర్రగుంటతండాలో ఉద్రిక్తత నేపథ్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యటనను రద్దు చేసుకుని హైదరాబాద్ వెళ్లారు. దాడిని నిరసిస్తూ ఎమ్మెల్యే పల్లా ప్రజాపాలన వేదికపై బైఠాయించగా పోలీసులు అరెస్టుచేసి జనగామ స్టేషన్‌కు తరలించారు.



గాయపడిన జర్నలిస్టును దవాఖానలో పరామర్శిస్తున్న జనగామ ఎమ్మెల్యే పల్లా

మంత్రి వస్తే ముందస్తు అరెస్టులా!

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జనగామ పర్యటన సందర్భంగా శనివారం రాత్రి నుంచే నియోజకవర్గంలోని పలువురు బీఆర్ఎస్ ముఖ్యనాయకులు, కార్యకర్తలను పోలీసులు గృహనిర్బంధం చేశారు. తండాలో పోలీసుల పికెటింగ్ ఏర్పాటు చేసి బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిని విడుదల చేయాలని తండావాసులు సభావేదిక వద్ద ఆందోళనకు దిగారు. ఈ సమయంలో ఎమ్మెల్యే పల్లా గోబ్యాక్ అంటూ కాంగ్రెస్ నేతలు నినాదాలు చేశారు. సీఐ దామోదర్‌రెడ్డి దగ్గరుండి మరీ సీఎం రేవంత్‌రెడ్డి పాటలను పెట్టించి కాంగ్రెస్ నాయకులు డ్యాన్స్‌లు చేసేలా రెచ్చగొట్టారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన ఎమ్మెల్యే పల్లా ఇది ప్రభుత్వ కార్యక్రమమా? లేక కాంగ్రెస్ పార్టీ సభానా అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. మరింత రెచ్చిపోయిన కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ నాయకులపైకి దాడి చేసేందుకు దూసుకెళ్లారు. బీఆర్ఎస్ కార్యకర్తలను సీఐ విచక్షణారహితంగా చితకబాదాడు. బీఆర్ఎస్ కార్యకర్త ప్రమోద్‌రెడ్డి చేతివేలు చితికిపోగా, బీఆర్ఎస్ వెంకిర్యాల గ్రామశాఖ అధ్యక్షుడు తాళ్లపల్లి అశోక్‌కు రక్తస్రావమైంది. గానుగపహాడ్ మాజీ సర్పంచ్ గుర్రం కుమార్, కార్యకర్తలు భూంరెడ్డి, రెహమాన్‌తో పాటు మరో 16 మందికి దెబ్బలు తగిలాయి. మంత్రి సభ రద్దయిన తర్వాత పోలీసులు ఎమ్మెల్యే పల్లాను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అధికారులే సభను నిర్వహించగా, సమావేశం ముగిసే సమయానికి వచ్చిన జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి వేదికపై లబ్ధిదారులతో ఫొటోలు దిగారు.

దాడులకు అదరం.. బెదరం

ఆదివారం రాత్రి జనగామలోని క్యాంపు కార్యాలయంలో ఎర్రగుంటతండా మాజీ సర్పంచ్ గుగులోత్ మంజుల, బీఆర్ఎస్ నాయకురాలు శారద, ఇతర నేతలు, పోలీసుల లాఠీదెబ్బలతో గాయపడ్డ యువకులు, గ్రామస్థులతో కలిసి పల్లా రాజేశ్వర్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ చౌకబారు ఎత్తుగడలతో చేస్తున్న దాడులకు అదరం.. బెదరం అని స్పష్టంచేశారు. ప్రజల పక్షాన నిలబడుతా.. ప్రభుత్వంతో కలబడుతా అని తేల్చిచెప్పారు. అర్హులైన వారికి పథకాలు అందేవరకు కొట్లాడుతూనే ఉంటానని, జనగామ ప్రాంత సమస్యలను మంత్రికి విన్నవించి నిధులు సాధించుకుందామని చూస్తే బయటనుంచి తెచ్చుకున్న జనాలతో కలిసి కాంగ్రెస్ నాయకులు దాడులకు పాల్పడితే సీఐ దామోదర్‌రెడ్డి స్వయంగా వారిని ఉసిగొల్పాడని మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను రెండు ప్లాస్టిక్ కర్రలు విరిగేలా కొట్టాడని తెలిపారు.

పోలీసులా.. కాంగ్రెస్ కార్యకర్తలా?: కవిత

జనగామ జిల్లా ఎర్రగుంటతండాలో బీఆర్ఎస్ కార్యకర్తలపై పోలీసులు జరిపిన అమానుష దాడిని తీవ్రంగా ఖండిస్తున్నానని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల్లా వ్యవహరిస్తూ బీఆర్ఎస్ కార్యకర్తలపై లాఠీచార్జీ పేరిట రక్తాలు వచ్చేటట్టుగా కొట్టడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. హామీల అమలుపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే లాఠీచార్జీ చేయిస్తారా? అని విరుచుకుపడ్డారు. నిర్బంధాలతో, లాఠీచార్జీలతో బీఆర్ఎస్ కార్యకర్తలను, నాయకులను భయపెట్టలేరని స్పష్టంచేశారు. రాజ్యాంగం ప్రసాదించిన భావప్రకటనా స్వేచ్ఛను రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజే హరించడం కాంగ్రెస్ దిగజారుడుతనానికి పరాకాష్ట అని నిప్పులుచెరిగారు.

లాఠీలు విరిగేలా, రక్తాలు వచ్చేలా కొడ్తరా?: హరీశ్‌రావు

జనగామ జిల్లా ఎర్రగుంటతండాలో జరిగిన పోలీస్ లాఠీచార్జీని మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. లాఠీలు విరిగేలా, రక్తాలు వచ్చేలా పోలీసులు విరుచుకుపడడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తంచేశారు. మాజీ సర్పంచ్, 8 మంది వార్డు సభ్యులపై పోలీసుల దురాగతం హేయమైన చర్య అని అభివర్ణించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అడిగితే లాఠీచార్జీలు, ప్రశ్నిస్తే అరెస్టులు జరుగుతున్నాయని మండిపడ్డారు. ఎన్ని రోజులు నిర్బంధాలు, పోలీస్ పహారాలతో ప్రభుత్వాన్ని నడుపుతారని ప్రశ్నించారు. నిరంకుశంగా ప్రవర్తించిన పోలీసు అధికారులపై చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

'ఇందిరమ్మ' ప్రారంభం మళ్లీ మళ్లీ!

- నిరుడు మార్చిలో ప్రారంభించిన సీఎం రేవంత్
- ఏడాదిలో ఒక్క ఇల్లు కూడా కట్టని ప్రభుత్వం
- తాజాగా 4 పథకాల్లో భాగంగా ఇందిరమ్మ స్కీమ్
- ప్రచార ఆర్భాటం కోసమే ప్రారంభించారని విమర్శలు

హైదరాబాద్, జనవరి 26 (నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ ఇండ్ల పథకంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, అధికారులు అనుసరిస్తున్న తీరుతో ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పథకాల ప్రారంభోత్సవాల పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నదని రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తున్నది. నిరుడు మార్చిలో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని సీఎం ప్రారంభించినా ఏడాదిలో ఒక్క ఇల్లు కూడా నిర్మించలేదు. కానీ ఆదివారం పథకాన్ని మళ్లీ ప్రారంభించారు. ఒకే పథకాన్ని ఎన్నిసార్లు ప్రారంభిస్తారని రాజకీయవర్గాల్లో ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

మార్గం లేదు.. మార్గదర్శకాలు లేవు

ఇందిరమ్మ ఇండ్ల పథకం అయోమయంగా తయారైందని ప్రజలు మండిపడుతున్నారు. నిరుడు మార్చి 11న భద్రాచలంలోసీఎం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. కొందరికి మంజూరు పత్రాలు కూడా ఇచ్చారు. రూ.22,500 కోట్లతో 4.5 లక్షల ఇండ్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. కానీ ఆచరణలో మాత్రం ఒక్క అడుగు కూడా ముందుకుపడలేదు. ఆదివారం కొత్త రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలతోపాటు ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని సీఎం మరోసారి ప్రారంభించారు. నారాయణపేట జిల్లా కోస్గిలో కొందరికి మంజూరు పత్రాలిచ్చారు.

'ఇందిరమ్మ' పథకం.. అయోమయం

ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇల్లు కోసం నిరీక్షిస్తున్న పేదలు కాంగ్రెస్ సర్కారు తీరుతో అయోమయానికి గురవుతున్నారు. ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తుల పరిశీలన, ఇంటింటి సర్వే పూర్తికాలేదు. కానీ లబ్ధిదారులను ఎంపిక చేసినట్టు గ్రామసభల్లో ప్రకటించారు. ఇవి తుదిజాబితాలు కాదని, మార్పులు చేర్పులు ఉంటాయని, దరఖాస్తు చేసుకోనివారు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు అంటున్నారు. జాగ ఉంటేనే ఇల్లు ఇస్తారా, ఇల్లు కట్టి ఇస్తారా అనే విషయంలో సీఎం, మంత్రులు, అధికారులు స్పష్టతనివ్వడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.

కేంద్రం, రాష్ట్రం దోబూచులాట!

కేంద్ర ప్రభుత్వానికి చెందిన ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-పీఎంఏవైతో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అనుసంధానం చేసినట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. పీఎంఏవై మార్గదర్శకాల ప్రకారం లబ్ధిదారుల ఎంపిక కోసం కేంద్రం యాప్ రూపొందించింది. దరఖాస్తుదారుల వివరాలను ఆ యాప్‌లో నమోదు చేసే ప్రక్రియ పూర్తికాలేదు. మరి లబ్ధిదారులను ఎంపిక చేయకుండా ఇండ్లు మంజూరు చేశామని చెప్పడం, పత్రాలు ఇవ్వడం అంతా బూటకమని విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఇందిరమ్మ పేరుంటే కేంద్రం నుంచి నిధులు ఇచ్చే ప్రసక్తే లేదని కేంద్రమంత్రి బండి సంజయ్ తేల్చిచెప్పారు. రెండు ప్రభుత్వాల మధ్యలో ఇల్లు కోసం నిరీక్షిస్తున్న తమ ఆశలు నెరవేరడం లేదని పేదలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం మాత్రం ప్రారంభోత్సవాలతో కాలయాపన చేస్తున్నదని విమర్శలు వినిపిస్తున్నాయి.

నీకు కావాలంటే అడుగు.. మాగురించి ఎందుకు?

- ఎమ్మెల్యే నాగరాజుపై మంత్రి సురేఖ ఆగ్రహం
- హసన్‌పర్తి మండలం పెంబర్తి సభలో ఘటన
- ప్రజలు లేక సభ ఆలస్యం.. మంత్రుల నిరీక్షణ
- మాట్లాడకుండా మహిళలను అడ్డుకున్న పోలీసులు
- అందరికీ పథకాలు అందుతయి: పొంగులేటి

నయీంనగర్, జనవరి 26 : హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం పెంబర్తిలో ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభం కావాల్సిన ప్రజాపాలన సభ జనాలు రాకపోవడంతో ఆలస్యమైంది. మంత్రితోపాటు అధికారులు జనాల రాక కోసం దాదాపు గంట పాటు ఎదురు చూడాల్సి వచ్చింది. కార్యక్రమానికి రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. సమయానికి ప్రజలు లేకపోవడంతో వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, కలెక్టర్ ప్రావీణ్య పెంబర్తి పంచాయతీలో, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, ఎంపీ కడియం కావ్య సమీపంలో ఉన్న ఓ కాంగ్రెస్ నాయకుడి ఇంటి వద్ద వేచి చూశారు. స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రజల రాక కోసం సభా స్థలం వద్ద ఉన్నారు. 'త్వరగా తోలుకురండి.. లేటవుతున్నది' అంటూ కాంగ్రెస్ శ్రేణులను పురమాయించారు.

కార్యక్రమం నడుస్తున్న క్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ తన నియోజకవర్గంలో దళితులు, నిరుపేదలు ఎక్కువ మంది ఉన్నారని, వారికి ప్రభుత్వం ఇచ్చిన ఇండ్లు సరిపోవని, అదే పశ్చిమ నియోజకవర్గం, తూర్పు నియోజకవర్గంలో సరిపోతాయని అనడంతో వెంటనే అక్కడే ఉన్న మంత్రి సురేఖ ఆగ్రహం వ్యక్తంచేశారు. 'నీకు కావాలంటే నువ్వు అడుగు.. అంతేగాని మా గురించి ఎందుకు మాట్లాడుతున్నవ్' అంటూ సీరియస్ అయ్యారు. 56వ డివిజన్‌లోని పూరుగుట్టకు చెందిన కొందరు మహిళలు తాము మంత్రితో మాట్లాడి తమ సమస్యను చెప్తామని ఎంత బతిమిలాడినా పోలీసులు వినకుండా అడ్డుకున్నారు. అపరిశుభ్ర వాతావరణంలో సభను ఏర్పాటు చేయడంపై ప్రజలు విసుగెత్తిపోయారు. 'ఈ కంపు వాసన ఏంది.. కనీసం వాసన రాకుండా చల్లేందుకు బ్లీచింగ్ పౌడర్‌కు కూడా ప్రభుత్వం వద్ద డబ్బులు లేవా?' అని పలువురు చర్చించుకున్నారు. చాలా మంది ప్రజలు వస్తారని భావించి కుర్చీలు తెప్పించిన అధికారులు, అకున్నంత మంది రాకపోవడంతో ఎలా తెచ్చిన కుర్చీలను ఎలానే తీసుకెళ్లారు. కొందరు మహిళా కానిస్టేబుళ్లు లబ్ధిదారుల వెంట తెచ్చుకున్న వస్తువులను క్షుణ్ణంగా పరిశీలించడంతో 'మేము ఎలా కనిపిస్తున్నం' అంటూ కొందరు మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

హనుమకొండ జిల్లా పెంబర్తి గ్రామసభలో ప్రజలు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు